'సరిగ్గా చెప్పాడు...'

సరిగా నేను పట్టుకునే సమయంలో మీరు నిట్టూర్చారు కదండీ... అందుకనే నాకు దొరక్కుండా ఎగిరిపోయిందండీ ఈగ...' అన్నాడు కిష్టయ్య తలని రౌండుగా అటూ ఇటూ తిప్పుతూ గదిలో ఎగురుతున్న ఈగవంక చూస్తూ. 'సువ్వొకడివి దొరికావ్ నా ప్రాణానికి....'

విసుక్కుంటూ కుర్చీలో వెనక్కి వాలాడు రాంబాబు. కిష్టయ్య మళ్ళీ తన ప్రయత్నంలో తాను పడ్డాడు.

మరో అయిదు నిమిషాలు గడిచాయ్.

'ఎంతపని చేశారండీ గురూగారూ....'

మళ్ళీ అన్నాడు కిష్టయ్యఎంతో బాధపడుతూ.

'నేనేం నిట్టూర్చలేదుగా...' అన్నాడు రాంబాబు కిష్టయ్య వంక కొరకొరా చూస్తూ.

'అబ్బే దాని గురించి కాదండీ...అటు చూడండి...' అన్నాడు గుమ్మంవేపు చూపిస్తూ.

రాంబాబు చూశాడు. అతనికేమి అర్థం కాలేదు.

'ఏమిటి... ఏముందక్కడ?' అని అడిగాడు.

'రోడ్డు అవతలవైపు చూడండి గురూగారూ...' అన్నాడు మరీ బాధగా కిష్టయ్య.

రాంబాబు రోడ్డుకి తటువైపు చూశాడు. కానీ ఏమీ అర్థం కాలేదు. విసుగ్గా కిష్టయ్యవంక చూశాడు.

'నువ్వు పట్టుకోబోయిన ఈగ ఆ వైపుగా ఎగిరిపోయిందా?'

ఇంతేనా మీకు అర్థం అయ్యింది అనే భావం వచ్చేలా చూశాడు కిష్టయ్య.

'రోడ్డుకవతల మిరపకాయ బజ్జీల బండి లేదా మాష్టారూ!...'

'ఉంది ... అయితే?...'

'అక్కడ జనం చూడండి...'

రాంబాబు చూశాడు. మిరపకాయలు బజ్జీల చుట్టూ జనం...బెల్లం చుట్టూ ఈగల్లా.

కొందరు ఆదిగా బజ్జీలు తింటున్నారు. మరికొందరు బండివాడు బజ్జీలు వేయిస్తుంటే నీళ్ళూరుతున్న నోళ్ళతో ఎదురుచూస్తున్నారు.

బజ్జీలవాయి తియ్యగానే బండిచుట్టూ కాచుకుని ఉన్నవాళ్ళు ఎగబడి డబ్బులు బండివాడి చేతిలో పెట్టి వేడివేడి బజ్జీలు తీసుకుని ఆబగా తింటున్నారు... ఎంతో కాలం నుండి తిండితిన్నని వాళ్ళలా.

వేసిన బజ్జీలు వేసినట్లే అయిపోతున్నాయ్.

'చూశారు కదండీ గురూగారు....' అన్నాడు కిష్టయ్య కంఠంలోజీరపలికిస్తూ.

రాంబాబు బజ్జీల బండి నుండి దృష్టిమరల్చి కిష్టయ్యవంక చూశాడు.

'అసలు మీరు ఫోటోస్టూడియో ఎందుకుపెట్టారండీ గురూగారూ.... '

'నువ్వు కాస్త నోరుముయ్...'

'హాయిగా మిరపకాయ బజ్జీల...'

'నిన్ను నోరుమూసుకోమన్నానా...'

రాంబాబు మళ్ళీ కుర్చీలో వెనక్కి వాలిపోయాడు.

రాంబాబు సొంత ఊరు తాడేపల్లిగూడెం. తండ్రి పరంధామయ వ్యవసాయం చేస్తాడు. చండశాసనుడు. తల్లి పార్వతమ్మ మాత్రం బహు నెమ్మది మనిషి,చెల్లెలు పేరు రాజ్యలక్ష్మి, పెద్దమనిషి కాగానే స్కూల్ మాన్పించేశారు.

రాంబాబు డిగ్రీ పాసయ్యాక అప్లయ్ చెయ్యని ఉద్యోగంలేదు...వెళ్ళని ఇంటర్వ్యూ లేదు. కానీ ఫలితం ఏమీ కనిపించలేదు. తాడేపల్లిగూడెం అయితే లాభం లేదని హైదరాబాదుకు వెళ్ళి అక్కడొక స్నేహితుడి గదిలో ఎడ్జస్టయిపోయి ఉద్యోగాల వేట సాగించాడు రాంబాబు. ప్రయోజనం ఏమీ కనిపించలేదు.

ఆ టైములోనే రాంబాబుకి శ్యామల్రావు కనిపించాడు. శ్యామల్రావు రాంబాబు క్లాస్ మేట్స్, డిగ్రీ కాగానే శ్యామల్రావు హైదరాబాదు వచ్చి ఒక ఫోటో స్టూడియో పెట్టాడు.

శ్యామల్రావుతో పాటు అతని స్టూడియోకి వెళ్ళి అక్కడి పరిస్థితుల్ని గమనించిన రాంబాబుకి జ్ఞానోదయమైంది.

శ్యామల్రావు తన ఫోటోస్టూడియో ద్వారా మంచి లాభాలు ఆర్జిస్తున్నాడు. ఎప్పుడూతెరిపి లేకుండా ఫోటోలు తీయించుకోడానికి అతని స్టూడియోకి జనం వస్తూనే వుంటారు.

రాంబాబు తనుకూడా ఒక ఫోటోస్టూడియో పెడితే బావుంటుందన్న ఆలోచన వచ్చింది.

ఒకరికింద పనిచేసేకంటే అదే నయం అనిపించింది. రాబడి కూడా బావుంటుంది.

రాంబాబు వెంటనే తాడేపల్లిగూడెం వెళ్ళి తను ఫోటో స్టూడియో పెట్టాలనుకుంటున్నట్లు తండ్రికి చెప్పాడు.

'తట్...వీల్లేదు' అన్నాడు పరంధామయ్య.

ఫోటో స్టూడియోమీద ఎంత ఆదాయం వస్తుందీ... శ్యామల్రావు ఏ విధంగా బాగుపడిపోతున్నాడో తండ్రికి వివరంగా చెప్పాడు రాంబాబు.

ఆదాయం గురించి చెప్పగానే పరంధామయ్య మెత్తబడ్డాడు. కాస్త పొలం అమ్మి ఆ డబ్బుతో 'ఇస్మైల్ ప్లీజ్' ఫోటోస్టూడియో పెట్టించాడు పరంధామయ్య.

తన పాలేరుకొడుకు కిష్టయ్యని తనకి అసిస్టెంటుగా తన కూడా హైదరాబాదు తెచ్చుకున్నాడు రాంబాబు.

కిష్టయ్య తన చేతిమీద కొట్టడంతో ఉలిక్కిపడి ఆలోచనల నుండి తేరుకుని చూశాడు రాంబాబు.

'అబ్బే...ఏం లేదు గురూగారూ...మీ చేతిమీద ఈగ వాలితే...' అన్నాడు కిష్టయ్య నసుగుతూ.

రాంబాబు ఒకసారి నిట్టూర్చి వాచ్‌వంక చూశాడు. ఆరున్నరైంది.

'మీరు చాలా పొరబాటుపని చేశారండీ గురూగారూ...' అన్నాడు బాధగా బయటికి చూస్తూ కిష్టయ్య.

'మళ్ళీ ఏమైంది?'

'అలా చూశారా జనం!... మిరపకాయలబజ్జీలకోసం ఎలా పరుగులు పెడుతూ వస్తున్నారో!!...'

రాంబాబు ఈర్ష్యగా బజ్జీలబండి వైపు చూశాడు. కానీ కొన్ని క్షణాలు మాత్రమే....

రాంబాబు ముఖంలో ఫీలింగ్స్ మారిపోయాయ్. అతని ముఖంలో ఆనందం విలయతాండవం చేసింది. సంతోషంతో పెదాలు ఈ చెవినుండి ఆ చెవిదాకా సాగిపోయాయ్. కళ్ళల్లో ఆశ్చర్యం ప్లస్ ఆనందం!!

'ఒరేయ్ కిష్టిగా ... చూశావా... ఆ జనం మొత్తం రోడ్డుదాటి ఇటువేపు వస్తున్నారు...' సంతోషంతో అరచినట్టుగా అన్నాడు రాంబాబు.

'అవును గురూగారూ...' మన ఫోటో స్టూడియోవంకే చూస్తూవస్తున్నారు...వాళ్ళందరూ మన దగ్గర ఫోటో తీయించుకోడానికే వస్తున్నారు గురూగారూ...'

క్విక్...లైట్లన్నీ రెడీగా పెట్టు....ఏదీ నా కెమేరా ఇలాతే ....' అన్నాడు రాంబాబు హడావిడి పడిపోతూ.

'వీళ్ళందరూ ఫోటో తీయించుంటేనాకు జేమ్స్‌బాండ్ సినిమా చూపించాలి గురూగారూ....'

'అలాగేరా....ముందున్నీ రెడీచెయ్యి...'

'ప్రామిస్....నిజంగా తీసుకెళతారా గురూగారూ?'

'నిజంగా...'

జనం మొత్తం స్టూడియో గుమ్మంముందు పోగయ్యారు. రాంబాబు కిష్టయ్య వాళ్ళవంక చూశారు. వాళ్ళ ముఖంలో ఫీలింగ్స్ చూస్తే వాళ్ళు ఫోటో తీయించుకోడానికి వచ్చినట్లు కనిపించలేదు రాంబాబుకి.

అయినా గొంతు పెగుల్చుకొని 'రండిసార్..... ఫోటో తీయించుకోడానికేనా... లోపలకి రండి...' అన్నాడు భయం భయంగా నవ్వుతూ రాంబాబు.

ఆ జనంలోంచి వస్తాదుల్లాంటి యువకులు ఇద్దరు ముందుకువచ్చారు వాళ్ళు ఏమీ సమాధానం చెప్పలేదు. రాంబాబు వంక సూటిగా చూశారు. రాంబాబు ఎడమకన్ను అదిరింది.

ఆ యువకులిద్దరూ చొక్కా చేతులు పైకి మడిచి రెండడుగులు ముందుకు వేశారు.

రాంబాబు, కిష్టయ్య నాలుగడుగులు వెనక్కి వేశారు.

*ఫ్రేమ్-2*

*ఫలం దక్కింది*

రాంబాబు కిందకి వంగి ఓపిగ్గా ఏరుతున్నాడు.

'అదిగోండి గురూగారూ .... అక్కడ ఒకటి ఉంది....' అన్నాడు కిష్టయ్య.

రాంబాబు దాన్ని ఏరేశాడు.

'ఇదిగోండి గురూగారూ.... ఇక్కడ ఇంకోటి ఉంది....' జాగ్రత్త గురూగారూ.... అసాలే గాజు పెంకులు.... గుచ్చుకుంటాయ్....'

రాంబాబు గుర్రుగా చూశాడు కిష్టయ్య వైపు.

'ఏరా.... ఇంతకీ బాస్‌ని నేనా నువ్వా.... నేనేమో నడుం పడిపోయేలా వంగి గాజుపెంకులూనీ ఏరుతుంటే నువ్వేమో నాకు ఇన్స్ట్రక్షన్స్ ఇస్తున్నావా? నువ్వుకూడా ఏరు....'

'తప్పైపోయింది గురూగారూ.... జరిగిన బీభత్సానికి నాకేం చెయ్యాలో తోచక మెదడు మొద్దుబారిపోయింది.'

కిష్టయ్య కూడా కింద కూర్చుని గాజు పెంకులు ఏరసాగాడు.

'అదికాదురా..... అసలు మనం చేసిన తప్పేంటి?...'అన్నాడు రాంబాబు గాజు పెంకులు ఏరటం ఆపి కిష్టయ్యవంక చూస్తూ.

'మిరపకాయ బజ్జీల వ్యాపారం చెయ్యక పోవడం....' ఠక్కున అన్నాడు కిష్టయ్య.

'ఛస్...నోర్మూయ్...నేనంటుది అదికాదు....ఇందాక వాళ్ళొచ్చి అన్ని విరగ్గొట్టి పోయారే....దాని గురించి.....'

'అవునండి గురూగారూ.... అదే నాకు అర్థం కావడం లేదు.'

'మనిషి అందంగా లేకపోతే మనమేం చేస్తాం?'

'అవును గురూగారూ.....మనమేం చేస్తాం?'

'మొహం ఎలా ఉంటే ఫోటోలో అలానే పడ్తుంది....లేని అందం ఎక్కడనుండి వస్తుంది.... హు....' పగిలిన గాజుముక్కలవంక ఉక్రోషంగా చూస్తూ అన్నాడు రాంబాబు.

'నిజమే గురూగారూ.... మొహం ఎలా ఉంటే ఫోటోలో అలానే పడ్తుంది....కానీ వాళ్ళలో కొందరికి మొహాలే తియ్యలేదు కదండి....వట్టి మొండాల్ని ఫోటో తీశారు...కొందరివేమో తల ఒక్కటే....మెడకాయ్ దాకా తీశారండీ....బహుశా వాళ్ళకి అందుకే కోపం వచ్చి ఉంటుందడీ....'

'ఎంత కోపం వస్తే మాత్రం స్టూడియో అద్దాలూ, ఫర్నిచరూ పగల గొడితే ఎలా....? నచ్చకపోతే మళ్ళీ తియ్యమనాలిగానీ....'

'మీరు మళ్ళీ అలాగే తీస్తారని వాళ్ళ అనుమానం గురూగారూ....'

రాంబాబు కిష్టయ్య వంక కొరకొరా చూశాడు.

'అంటే ఏంటి నీ ఉద్దేశం...నేను ప్రతిసారీ ఛండాలంగా ఫోటోలు తీస్తాననా?'

'అలా నేనన్నానా గురూగారూ ఈ ప్రజల మనస్థత్వం గురించి చెప్తున్నా....'

'హు... నచ్చకపోతే పగలగొడ్తారట!.... పగల గొడ్తారు!!.... ఈ స్టూడియో ఏమైనా వాళ్ళా బాబు సొత్తా....పోలిస్ కంప్లయింట్ ఇస్తాను ....హు....' గొణుక్కుంటూ గాజుపెంకులు ఏర్తున్నాడు

రాంబాబు.

'అవునండీ గురూగారూ.... మీరు పోలీసు కంప్లయింట్ ఇవ్వండి వాళ్ళ తిక్క వదుల్తుంది.....'

'కిష్టయ్యా..... ఇలా గాజుపెంకులు ఏర్తే అర్థరాత్రి దాకా ఏరాల్సిందే....చీపురుతో గదిమొత్తం ఓ మూలకి ఊడ్చి గాజుపెంకులు పేపరులోకి ఎత్తి పారెయ్...అదిగో ఆ పడిపోయిన టేబులుని కాస్త నిలబెట్టు, కుర్చీలన్నీ వేటి స్థానంలో వాటిని పెట్టు....వాడెవడో రోడ్డుమీదకి ఒకస్టూలుని విసిరేశాడు....దాన్నితెచ్చి లోపల పెట్టు.... ఈలోగా నేను పక్కషాపునుండి పోలీసులకు ఫోన్ చేస్తాను...' అన్నాడు రాంబాబు లేచి నిలబడ్తూ.

'వాళ్ళ దగ్గరనుండి నష్టపరిహారం ఇప్పించమని అడగండి గురూగారూ....' అన్నాడు కిష్టయ్య చీపురు కోసం లోపలకు వెస్తూ.

రాంబాబు స్టూడియో బయటికి వచ్చి పక్కనే వున్న ఫాన్సిషాపు లోంచి నెంబరుడయల్ చేశాడు.

'హలో .... పోలీస్ స్టేషన్ ....' అంది అవతల నుండి ఓ కంఠ స్వరం.

'హలో సార్.... మీరు వెంటనే ఇక్కడకు రావాల్సార్.... అన్నాడు రాంబాబు ఆతృతగా.

'ఏం జరిగిందక్కడ.... హత్యా?!....చెప్పండి హంతకుడెవరు. షూట్ చేసేస్తాను....' అంది అవతలి కంఠస్వరం మరింత ఆతృతగా.

'హత్య కాదు సార్.... నా ఫోటో స్టూడియోని కొందరు దుండగులు ఎటాక్ చేసి అద్దాలనీ విరగ్గొట్టారు సార్....'

'అవునా... అయితే వెంటనే వస్తాను.... ఆ దుండగులు ఇంకా అక్కడే ఉన్నారా' .... షూట్ చేస్తాను...'

'వాళ్ళింకా ఎందుకుంటారు సార్...పారిపోయారు.'

'ఎందుకు మీ ఫోటో స్టూడియోని ఎటాక్ చేశారు? పాత పగలా?

'అలాంటిదే సార్.... నేను వాళ్ళ ఫోటోలు బాగా తియ్యలేదని వాళ్ళకి అనిపించి కోపం వచ్చి అద్దాలు పగలకొట్టారు సార్....వాళ్ళమొహాలు బాగోపోతే నేనేం చేస్తాను సార్....'

'ఫోటోలు బాగా తియ్యలేదని స్టూడియో అద్దాలు పగల కొట్టారా అవతలి గొంతులో ఆశ్చర్యం ధ్వనించింది.

'అవున్సార్... మీకెలా తెల్సుసార్?'

'నేను కూడా ఇందాక నీ ఫోటో స్టూడియోకి వద్దామని అనుకున్నాను....కానీ అర్జంటు కేసొకటి తగలడంవల్ల రాలేకపోయాను...'

'మీరు రావల్సింది సార్...'

'వచ్చుంటే వాళ్ళలాగా నేను అద్దాలు పగలగొట్టేవాడిని కాదు. నిన్ను షూట్ చేసి ఉండేవాడ్ని....'

రాంబాబు కంగారు పడ్డాడు.

'అదేంటి సార్..... మీరు షూట్ చెయ్యాల్సింది వాళ్ళకనిద్సార్? !!....'

'షటప్...నా ముగ్గురు కూతుళ్ళూ నీ దగ్గరికి వచ్చి ఫోటో తియ్యమంటే వాళ్ళ కాళ్ళని మాత్రం ఫోటో తీసి పంపిస్తావటయ్యా....చెప్పు....ఆ స్టూడియో ఎగ్జాక్ట్‌గా ఎక్కడుంది.... షూట్‌చేస్తాను....అడ్రసుచెప్పు....' అట్నుండి అరిచాడు ఇన్స్‌పెక్టర్ శ్రీ రామ్.

'ఎడ్రసా?.... ఏమోనండి ...నాకు తెలీదండి.... అసలు కంప్లయింట్ ఏమీ లేదండీ..... డ్రాప్ చేసుకుంటున్నా...' వణికేకంఠంతో అని ఫోన్ డిస్కనెక్ట్ చేసి తడబడే అడుగుల్తో స్టూడియో వైపు వెళ్ళాడు రాంబాబు.

'ఏవండీ గురూగారూ.... కంప్లయింట్ ఇచ్చారా?, వాళ్ళచేత నష్టపరిహారం ఇప్పిస్తానని అన్నారా?....' అన్నాడు అప్పుడే లోపలికి అడుగు పెడ్తున్న రాంబాబుని చూసి కిష్టయ్య.

'షూట్ చేస్తానని అన్నాడు ఇన్‌స్పెక్టర్....' అన్నాడు రాంబాబు జుట్టు పీక్కుంటూ.

'షూట్ చెయ్యడం ఎందుకండీ గురూగారూ.... మనకి నష్టపరిహారం ఇప్పిస్తే చాలునని చెప్పలేక పోయారా?'

షూట్ చేస్తానని చెప్పింది వాళ్ళని కాదు ...మననే....'

అదేంటి గురూగారూ .... మధ్యలో మనమేం చేశాం?' కిష్టయ్య ఆశ్చర్యపోయాడు. 'ఆ ఇన్‌స్పెక్టర్‌గారి అమ్మాయిలు కూడా మన స్టూడియోలో ఫోటోలు దిగారట...'

'అదీ సంగతి....' అన్నాడు కిష్టయ్య అర్థం అయిందన్నట్లుగాతల కిందికి మీదికి ఊగిస్తూ.

'అయినా అందులో మన తప్పేముందిరా.... నేను ఫోటో తీసే సమయానికి వాళ్ళు కదిలుండొచ్చుగా....'

'అంతేనండీ గురూగారూ....ఈ రోజుల్లో నీతికి నిజాయితీకి విలువ లేదండి.... కానండి గురూగారూ....చివరికి సత్యమే జయిస్తుందండి ....మొన్న అదేదో సినిమా చూశాం కదండీ....అందులో కూడ చివరికి సత్యమే జయించింది కదండీ.... ఏం సినిమా అండీ అదీ?....'

'అన్ని సినిమాల్లో చివరికి సత్యమే జయిస్తుందిలే.....'విసుక్కున్నాడు రాంబాబు.

'ఏ మాటకామాటే చెప్పుకోవాలి గురూగారూ..... ఇందాక పనోళ్ళు కాస్తంత మాన వత్వం ఉన్నవాళ్ళే.... మనమీద అస్సలు చెయ్యేవెయ్యలేదు....'

'అద్దాలన్నీ పగలగొట్టారు.... అదిచాల్దా? మా నాన్నకీ విషయం తెలిస్తే డొక్క చీరేస్తాడు.... ఫోటో స్టూడియో వద్దూ నా బొందావద్దు... ఇంటికి వచ్చెయ్యమంటారు...'

'మీ నానగారికి ఎలా తెలుస్తుంది గురూగారూ' కొత్తఅద్దాలు బిగించెయ్యండి.... విరిగిన కుర్చీలు బాగు చేయించెయ్యండి ....'

'ఏం దానికి తక్కువ డబ్బు అవుతుందని అనుకున్నావా?....'

'అయినా మీ నాన్నగారు హైదరాబాద్ వచ్చినప్పుడు కదా...'